క్లుప్తంగా

సీఐఐ చైర్మన్‌గా లాల్‌కృష్ణ నియామకంపై హర్షం



వరవాడ: జేఎస్ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి. లాల్‌కృష్ణ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్ చైర్మన్‌గా నియామకం కావడంతో జేఎస్ ఫార్మా పారిశ్రామిక వేత్తలు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నగరంలో శనివారం జరిగిన సీఐఐ వార్షిక సమావేశంలో సభ్యులు ఈ మేరకు తీర్మానించారు. రాంకీ ఎండీగా వ్యవహరిస్తూ దేశ విదేశాల నుంచి ఫార్మా కంపెనీలను జేఎస్ ఫార్మాసిటీలోకి తీసుకురావడంతో పాటు ఫార్మా రంగంలో ఆయనకున్న అపార అనుభవమే సీఐఐ చైర్మన్ పదవి అధిష్టించడానికి కారణమని పలువురు పారిశ్రామికవేత్తలు పేర్కొన్నారు. రాంకీ కమర్షియల్ హబ్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ లాల్‌కృష్ణను రాంకీ కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐఐ చైర్మన్ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పదవికి సముచిత న్యాయం చేస్తానని డాక్టర్ లాల్‌కృష్ణ అన్నారు.

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న శంకరావు తదితరులు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు పరిధి విజినిగిరిపాలెంలోని హనుమాన్ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామికి సింధూర, తమలపాకుల పూజలు చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్లు సతివాడ శంకరరావు, మజ్జి సూరిబాబు తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

శాకాహార సద్భావన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు

గాజువాక: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ సభ్యులు చినగంట్యాడ పరిసర ప్రాంతాల్లో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ప్రతినిధి ఎం.శివ గణేశ్వరరావు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ ఆశయం మేరకు శాకాహార జగత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ర్యాలీలో శాకాహార ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధులు టి.రేవతి, సి.జగదీశ్వరి, పీఎస్ఎన్ మూర్తి, జి.పద్మావతి, బి.అప్పారావు, భాగ్య, రామకృష్ణ, శివాజీ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావానికి ప్రతీక త్యాగరాజ కృతులు



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న నారాయణ బృందం


ఉక్కునగరం: భారతీయ శాస్త్రీయ సంగీతానికి తలమానికంగా నిలిచే త్యాగరాజ కృతులు.. నిజమైన భక్తి భావనకు ప్రతీకగా నిలుస్తాయని ఉక్కు జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, మార్కెటింగ్ సీజీఎం ఎం. సత్యనారాయణ అన్నారు. స్టీల్‌క్లబ్, విస్కా సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కునగరం స్టీల్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవం–2023 కార్యక్రమంలో వారు మాట్లాడారు. విస్కా అధ్యక్షుడు నేమాని శ్రీనివాస శర్మ, కార్యదర్శి ఎ. కేశవరావు మాట్లాడుతూ సంప్రదాయ బద్ధమైన చక్కని కార్యక్రమాలను ప్రేక్షకులకు అందించడంలో విస్కా ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఆకాశవాణి ఏ గ్రేడ్ కళాకారుడు బి.ఎ. నారాయణ బృందంచే నిర్వహించిన పంచరత్న సేవ, త్యాగరాజ విరచిత కృతుల నాద నీరాజనం కార్యక్రమాలు శ్రోతలను భక్తిరస సముద్రంలో ఓలలాడించాయి. కార్యక్రమంలో విస్కా, స్టీల్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వినూత్నం.. విభిన్నం

- విద్యార్థులకు మేలు చేసేలా 'సెల్ఫ్'
- తీర్చిదిద్దిన నంగినారపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు



సెల్ఫ్ ప్రోగ్రాం తయారు చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి(ఫైల్)



ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా సిద్ధం చేసిన సెల్ఫ్ ఆన్‌లైన్ సాధనం

సబ్బవరం: విద్యార్థులను స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు ప్రోత్సహించే విధంగా సబ్బవరం మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సెల్ఫ్ అనే వినూత్న ప్రోగ్రాంను ఆవిష్కరించారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు తమకు అర్థంకాని అంశాలతో పాటు సందేహాలను ఆన్‌లైన్‌లోనే నివృత్తి చేసుకునే విధంగా ప్రోగ్రాం రూపొందించారు.

ఎక్కడైనా.. ఎప్పుడైనా..

ఇది ఆన్‌లైన్ సాధనం కావడంతో స్మార్ట్ ఫోన్‌లో విద్యార్థులు ఎక్కడైనా,ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులు సరళమైన పద్ధతిలో అన్ని సబ్జెక్టులు అర్థం చేసుకుని తమ సందేహాలను నివృత్తి చేసుకునే విధంగా దీన్ని సిద్ధం చేశారు. విద్యార్థులు తమ అభ్యసనలో భాగంగా వరుసగా అడిగే ప్రశ్నలకు ముందుగా జవాబులు చెప్పిన తర్వాతే ఇతర ప్రశ్నలు వచ్చే విధంగా రూపొందించారు. ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతే దానికి సంబంధించిన సమాధానం వివరించే వీడియో వచ్చేలా ప్రోగ్రాం డిజైన్ చేశారు. వరుసగా అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాతే ముందుకు వెళ్లడం జరుగుతుంది. దీంతో విద్యార్థులు క్లిష్టమైన అంశాలను నేర్చుకోవడంతో పాటు మరింత విస్తృతంగా సంబంధిత అంశాలను తెలుసుకోవచ్చు.

సాఫ్ట్‌వేర్ లేకుండానే ..


ఈ టూల్‌ను వినియోగించుకోవడానికి ఎలాంటి సాఫ్ట్‌వేర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం పీడీఎఫ్ ఫైల్ ద్వారా వినియోగించుకునే విధంగా రూపొందించారు. ఈ సెల్ఫ్ ప్రోగ్రాంలో భాగంగా సబ్జెక్టుల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాన్ని పాఠశాల,మండల,జిల్లా స్థాయిల్లో పర్యవేక్షించేందుకు అవసరమైన డ్యాష్ బోర్డును కూడా రూపొందించారు.

ప్రయోజనం ఇలా..

విద్యార్థి సబ్జెక్టును అర్థం చేసుకోవడంలో సమస్య ఉంటే వీడియోను పదేపదే వీక్షించవచ్చు. అతను ఎప్పుడైనా,ఎక్కడైనా అంశాలను చూసుకోవచ్చు.ఇది స్వీయ మూల్యాంకనం, స్వీయ అభ్యసన సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ వీడియోలు గూగుల్ ఫారంలో పొందుపర్చడంతో విద్యార్థులు కంటెంట్ వీడియో నుంచి పక్కకు మరళలేరు. ఈ టూల్‌ను క్లిక్‌బుల్ పీడీఎఫ్ ద్వారా వినియోగించుకోవచ్చు. గూగుల్ ఫారంలో 10 ప్రశ్నలు ఎంసీక్యూ రూపంలో ఇచ్చారు.తద్వారా విద్యార్థులు సరైన సమాధానం ఎంచుకుంటే తదుపరి ప్రశ్నకు వెళ్తుంది. విద్యార్థి తప్పు సమాధానం ఎంచుకుంటే అది వివరణ వీడియోకి తీసుకువెళ్తుంది. పూర్తి వీడియో చూసిన తర్వాత విద్యార్థి సరైన సమాధానం ఎంచుకోవడానికి అదే ప్రశ్నకు మళ్లించబడతారు. దీంతో విద్యార్థులు క్లిష్టమైన భావనలను నేర్చుకోగలుగుతారు.

ప్రోగ్రాం లక్ష్యం ఇదీ

- స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు విద్యార్థులను ప్రోత్సహించడం
- విద్యార్థుకు క్లిష్టమైన అంశాల్లో సందేహాలను నివృత్తి చేయడం.
- తక్షణ సందేహ నివృత్తి కలిగించడం
- విద్యార్థుల నిరంతర మూల్యాంకనం
- పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడం



డ్యాష్ బోర్డులో చూపిస్తున్న పాఠశాలల వారీగా వివరాలు

పర్యవేక్షణకు డ్యాష్‌బోర్డు



పాఠశాల,మండల,జిల్లా స్థాయిల్లో పర్యవేక్షించడానికి అవసరమైన డ్యాష్ బోర్డు రూపొందించాం.ఈ డ్యాష్ బోర్డులో జిల్లాలోని అన్ని మండలాల వారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పేర్లు ఉంటాయి. ఆయా పాఠశాలలను క్లిక్ చేయడం ద్వారా పూర్తి చేసిన విద్యార్థుల పేర్లు ప్రదర్శించబడతాయి.

–పోతూరి శ్రీనివాసరావు,
భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు,
నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
సబ్బవరం మండలం

సాధారణ ఆన్‌లైన్ సాధనం



సెల్ఫ్(సెల్ఫ్ ఎవల్యూషన్ అండ్ లెర్నింగ్ ఫర్ ఫ్యూచర్) ఇది విద్యార్థుల కోసం సాధారణ ఆన్‌లైన్ సాదనం. వారు దీన్ని ఎప్పుడైనా,ఎక్కడైనా స్మార్ట్ ఫోన్ ద్వారా వినియోగించుకోవచ్చు. ఇది ప్రతి అధ్యాయానికి సంబంధించిన బహుళ ఎంపిక ప్రశ్నలు అడుగుతుంది. విద్యార్థులు తమ స్వీయ అభ్యాసం–మూల్యాంకనం కోసం గూగుల్ ఫారం ఆధారిత ఆన్‌లైన్ మూల్యాంకనాలను సబ్జెక్టుల వారీగా సిద్ధం చేశాం.

–నంది సోమేశ్వరరావు, ఉపాధ్యాయుడు,
నంగినారపాడు పాఠశాల,సబ్బవరం మండలం.

వైభవంగా బంగారమ్మతల్లి తీర్థం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గంట్ల శ్రీనుబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత బంగారమ్మ తల్లి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు, భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపుకుంకుమలు సమర్పించారు.దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థానం ఏఈవో ఐజిరోతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్షతగాత్రురాలికి ఆర్థిక సాయం



సరస్వతి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వీరాంజనేయ యూత్ సభ్యులు

సబ్బవరం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంతకాపల్లి శివారు ఒమ్మువానిపాలేనికి చెందిన కోన సరస్వతిని వంగలి గ్రామానికి చెందిన వీరాంజనేయ యూత్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. సరస్వతి కుటుంబ సభ్యులకు రూ.16 వేల నగదుతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరకులు ఆ యువకులంతా అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

సీతంరాజు విజయమే లక్ష్యంగా పనిచేయండి

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై ముఖ్యనాయకులతో సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. వాడచీపురుపల్లి శివారు దణాయిపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధి విధానాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ మంచి వ్యక్తిగా పేరుందన్నారు. ఎమ్మెల్సీగా గెలిపించి పెద్దల సభకు పంపించడం ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. మండంలో భారీ మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల మతాలు, పార్టీలతో పనిలేకుండా అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి దోహదపడతాయని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న జాస్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జాస్తి వీరాంజనేయులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర పంచాయతీపరిషత్ అధ్యక్షుడు, అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి డాక్టర్ జాస్తి వీరాంజనేయులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయనపేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేశారు.

భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా
- ఉత్సాహంగా ఆనంద మేళా



ఆనంద మేళాను ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహుతులకు స్వాగతం పలికారు. అనంతరం సంజయ్‌కుమార్‌సిన్హా మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు దీపిక లేడీస్ క్లబ్ సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య రూపాలు, సాంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, దీపిక లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు



ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు. ఆలయ అర్చకుడు పవన్ తదితరులు ఈసేవ నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కల్యాణం జరిపించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికులకు నష్టం కలిగించే ఈ నిర్ణయాలపై కేంద్రం పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 745వ రోజు, ఆదివారం సంస్థకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. కార్మిక చట్టాలను విస్మరించి కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహంగా ఉన్నారన్నారు. ప్రజా శేయస్సు కోరి ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం



దీక్షలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి, నాయకులు

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం కాకుండా రక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరాహార దీక్షలు 675వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి లభించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు కూడా ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమవంతు పాత్రను పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయని గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం కూడా అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు శివాజీ, ఏపీ పరిరక్షణ జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి జగన్ మురారి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన



రోగులకు మందులు అందజేస్తున్న వెంకటరమణ

సబ్బవరం: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని నంగినారపాడు గ్రామంలో స్ఫూర్తి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని 88వ వార్డు నాయకుడు ఇందల వెంకట రమణ ప్రారంభించారు. ఉచిత కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. అజనగిరి, వెదుళ్లనరవ, కొత్తూరు,గంగవరం,నంగినారపాడు గ్రామాల నుంచి సుమారు 323 మంది రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 10 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇందలి శ్రీనివాసరావు, ట్రస్టు చైర్మన్ బీవీఎన్ సాగర్,డాక్టర్ రవికుమార్,డాక్టర్ సురేష్, డాక్టర్ కుమార్ రాజ్,డాక్టర్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కొటాన రాము, కర్రిబాబు



ఉత్సాహంగా సాగుతున్న కోలాటం పోటీలు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో కొలువైన పరదేశిమాంబ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కోటాలం పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మండల పార్టీ కన్వీనర్ కర్రిబాబు ప్రారంభించారు. పోటీల్లో 17 కోలాటం జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకుడు బోకం శ్రీనివాస్ తెలిపారు. సర్పంచ్ బోకం స్వామినాయుడు, బోకం అప్పలనాయుడు,బోకం కాసుబాబు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ద్వారకా జోన్ ఏసీపీ మూర్తి హెచ్చరిక
- ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి తదితరులు

ఎంవీపీ కాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ద్వారకా జోన్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను ఎంవీపీ స్టేషన్‌కు ఆదివారం పిలిచి ద్వారకా జోన్ ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి పలు హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేర ప్రవృత్తిని మార్చు కుని సమాజంలో బాధ్యతగల పౌరులుగా జీవించాలని హితవు పలికారు. ప్రశాంత విశాఖ నగరం పేరును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి దేవాలయం

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని కొండపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 28న మంగళవారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 7 గంటలకు శ్రీవారి కల్యాణం జరిపించనున్నారు. మార్చి 1న బుధవారం ఉదయం 9 గంటలకు వైదిక సదస్యం, సాయంత్రం 7 గంటలకు పండిత సదస్యం జరగనుంది. మార్చి 2, 3 తేదీల్లో ఉదయం 9 గంటలకు నిత్య హోమం, సాయంత్రం 7 గంటలకు లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. 04న శనివారం ఉదయం 8 గంటలకు ధ్వజ అవరోహణం, నవకలశ స్నపనం, సాయంత్రం 7 గంటలకు పుష్పయాగం, ఉయ్యాల సేవ, రుత్విక్‌ల సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.